# మంత్రి జూపల్లి కృష్ణారావు కలిసిన
# పట్నంలో పాలమూరు బిడ్డలు





**కూకట్‌పల్లి, జనవరి 23 (నేటి ప్రస్థానం) :** తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్,టూరిజం, కల్చరల్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును పట్నంలో పాలమూరు బిడ్డల సంక్షేమ సంఘం సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం కార్యాలయం ప్రారంభోత్సవం,సంస్థ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావును ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం సభ్యులు ఎం.ఎ.కరీమ్, గోపాస్ రవీందర్,గోపాస్ చంద్రశేఖర్,సంకి సత్యం, డి.కుర్మయ్య,బండి బంగారి,సాయన్న,డి. సత్యనారాయణ,ఆర్టీసీ ఆనంద్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.



# రాందేవ్ రావ్ ఆసుపత్రిలో
# గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ప్రారంభం

## ఘనంగా రాణి కుముదిని దేవి 114వ జయంతి వేడుకలు



**కూకట్‌పల్లి, జనవరి 23 (నేటి ప్రస్థానం) :** రాందేవ్ రావ్ ఆసుపత్రి నిరుపేదలకు వైద్య సేవలు అందించడంలో ఎల్లప్పుడు ముందుంటుందని ఆసుపత్రి డైరెక్టర్ విక్రమ్ దేవ్ రావు అన్నారు. గురువారం రాణి కుముదిని దేవి 114 వ జయంతిని పురస్కరించుకొని ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో రాణి కుముదిని దేవి జయంతి వేడుకలను ఆసుపత్రి నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నిర్వాహకులు, సిబ్బంది రాణి కుముదిని దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విక్రమ్ దేవ్ రావు మాట్లాడుతూ వంద ఏళ్ళ క్రితమే మహిళా సాధికారిత కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి రాణి కుముదిని దేవి అని కొనియాడారు. ఆమె స్ఫూర్తి తోనే రాందేవ్ రావ్ ఆసుపత్రిలో నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు డాక్టర్ పబ్బిశెట్టి వెంకటేష్,ఎండి డాక్టర్ కమలాకర్,అసుపత్రి డైరెక్టర్‌లు మీరా రావు,జ్యోతి రావు, ప్రశాంత్ రెడ్డి, అపర్ణ రావు,అస్పత్రి సిఈఓ యోబు, అనంత రెడ్డి,డాక్టర్ ఛాయదేవి, పలువురు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



# సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు
# అనుగుణంగా యువత నడుం బిగించాలి


## కౌకుట్ల రాహుల్ రెడ్డి

**కీసర, జనవరి 23 (నేటి ప్రస్థానం) :** నేటి యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలకు అనుగుణంగా దేశం కోసం నడుం బిగించాల్సిన అవసరం ఉందని నాగారం మున్సిపల్ బిజెపి యువ నాయకులు కౌకుట్ల రాహుల్ రెడ్డి అన్నారు.గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధి నేతాజీ నగర్ కాలనీ వద్ద ఆయన విగ్రహానికి కౌకుట్ల రాహుల్ రెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్ర మంలో భాజపా నాయకులు పి.వెంకటేశ్వర రావు, కేశవ్ రెడ్డి, సూర్య శేఖర్ రెడ్డి, కె.వెంకటేశ్వర రావు, ఉద్దమర్రి సోమయ్య, నరేందర్ రెడ్డి,వామన్ రావ్,సాయికిరణ్, అప్పి రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో దోషికి 20 ఏళ్లు జైలు శిక్ష

**కర్నూలు, జనవరి 23 :** మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో దోషికి కర్నూలు జిల్లా స్పెషల్ ఫోక్సో కోర్టు తీర్పు 20 ఏళ్లు జైలు శిక్ష , రూ.10 వేలు జరిమానా విధించింది.. కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ తెలిపిన వివరాల ప్రకారం కర్నూలు జిల్లా, గోనెగండ్ల మండలం , గంజ హల్లి గ్రామంకు చెందిన జెసిబి కి డ్రైవర్ గా దర్గా షేక్షావలి పని చేస్తున్నాడు. అతడు కర్నూలు , మహావీర్ నగర్ లో ఉంటున్న మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడు. మైనర్ బాలిక తల్లి జి. శాంత 2021సంవత్సరం, ఆగస్ట్ 12వ తేదిన కర్నూలు మహిళా పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. పోక్సో యాక్ట్ కింద నిందుతుడిపై అప్పటి మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ వెంకటరామయ్య దర్యాప్తు చేపట్టి సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన కర్నూలు జిల్లా స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి భూపాల్ రెడ్డి నిందితుడిని దోషిగా తేల్చి కి 20 సంవత్సరాల జైలు శిక్ష , రూ. 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితు రాలికి ప్రభుత్వం తరపున రూ. 2 లక్షల నష్ట పరిహారం ఇవ్వవలసిందిగా ఆదేశించారు.



# స్వాతంత్ర పోరాటంలో నేతాజిది
# కీలక పాత్ర : మాధవరం కాంతారావు



**కూకట్ పల్లి,జనవరి 23 (నేటి ప్రస్థానం) :** సాయుధ పోరాటంతోనే దేశానికి స్వాతంత్రం సాధ్యమని ఆజాద్ హిందూ ఫౌజ్‌ను స్థాపించి తెల్లవారితో పోరాడి,దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కీలకపాత్ర వహించిన ఘనత నేతాజీ సుభాష్ చంద్రబోస్ దేనని కూకట్ పల్లి నియోజకవర్గం బిజెపి ఇన్ ఛార్జ్ మాధవరం కాంతారావు అన్నారు.గురువారం నియోజకవర్గ పరిధిలోని జనతా నగర్ లో సీనియర్ నాయకులు యాదగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలకు మాధవరం కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం బోస్ జయంతిని 'పరాక్రమ్ దివస్‌గా' నిర్వహిస్తుందన్నారు, "నాకు రక్తం ఇవ్వండి, నేను మీకు స్వేచ్ఛ ఇస్తాను" అన్న చంద్రబోస్ శక్తివంతమైన నినాదం స్వాతంత్ర పోరాటంలో భారతీయులలో దేశభక్తిని ప్రేరేపించిందన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ నేతాజీని "దేశ్ నాయక్" అనే బిరుదును అందించారని గుర్తు చేశారు.క్రమశిక్షణ, దేశభక్తి, దైవభక్తి ఉన్న సేవాతత్పరుడైన సుభాష్ చంద్రబోస్ జీవితం ఆయన పోరాట స్ఫూర్తి మనకు ఆదర్శమని, నేటి యువత అతని అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఈగల సాయి,కిరణ్,కిషోర్, నేతాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వార్డు అభివృద్ధికి కృషి

## గూడూరు సబిత ఆంజనేయులుగౌడ్



**కీసర, జనవరి 23(నేటి ప్రస్థానం) :** వార్డు అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నాగారం మున్సిపల్ కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు ఈశ్వరిపూరీ కాలనీలో గురువారం మున్సిపాలిటీ నిధుల నుండి సుమారు 7 లక్షల రూపాయలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కౌన్సిలర్ గూడూరు సబిత ఆంజనేయులు గౌడ్ కొబ్బరికాయ కొట్టారు.అనంతరం కాలనీవాసులు కాలనీ అభివృద్ధి కొరకు నడుం బిగించిన స్థానిక కౌన్సిలర్ కు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ఉద్దమర్రి మాజి ఉపసర్పంచ్ నల్ల క్రిష్ణ రెడ్డి,గుండు శైలజ మధు గౌడ్,జైపాల్ రెడ్డి, సురేందర్ రెడ్డి,రమేష్, యాదగిరి,కాలనీ వాసులు వెంకటేశ్వర్ రెడ్డి, చిన్నస్వామి, విక్రమ్, బాలకృష్ణ, కుమార్, శ్రీరామ్ శర్మ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎవరు ఔనన్నా కాదన్నా తదుపరి నేత లోకేశే

## జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ.. అచ్చన్న ప్రకటన



**విశాఖపట్నం, జనవరి 23 :** ఎవరు వద్దన్నా, కాదన్నా... టీడీపీకి చంద్రబాబు తర్వాత నాయకుడు లోకేష్. ఏ చిన్న పిల్లవాడిని అడిగినా ఈ విషయాన్నే చెబుతాడు... ఇందులో ఏ వివాదం లేదు. ఏ నిర్ణయాలు అయినా కూటమి పెద్దల నిర్ణయం తర్వాతే అమలు చేస్తాం. ఎవరూ వ్యక్తిగతంగా మాట్లాడటం మంచి విధానం కాదు...ఇదీ అందరూ పాటిస్తున్నాం' అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఏపీ విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా లోకేష్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తు తున్నాయి. మంత్రి అచ్చెన్నాయుడు లోకేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లోకేష్‌పై మంత్రి అచ్చెన్నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి సేవ చేయాలన్న ఉద్దేశ్యంతో నారా లోకేష్ రాజకీయాల్లోకి వచ్చారని అన్నారు. టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా లోకేష్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. 2019 ఎన్నికల తర్వాత దుర్మార్గమైన వ్యక్తి రాష్ట్రానికి సీఎం అయ్యారని విమర్శించారు. ఆ సమయంలో టీడీపీ పార్టీ నేతలు, కార్యకర్తలను వైసీపీ నేతలు తీవ్రంగా వేధించారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఈ సమయంలో యువగళం పాదయాత్ర చేసి పార్టీ నేతలకు, కార్యకర్తలకు లోకేష్ ధైర్యాన్ని ఇచ్చారని చెప్పారు. కూటమికి 164 స్థానాలు రావడంలో లోకేష్ ప్రధాన భూమిక పోషించారని ఉద్ఘాటించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏపీకి భారీగా పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. కాగా.. మంత్రి నారా లోకేష్ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. లోకేష్‌కు రాజకీయ, సినీ ప్రముఖులు విషెస్ చెబుతున్నారు. దీంతో పాటు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమా నులు కూడా లోకేష్‌కు పుట్టిన రోజు వేడుకలను వాడవాడలా జరుపుతున్నారు. ఏపీ వ్యాప్తంగా లోకేష్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో కేక్ కటింగ్ చేసి, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేల ఆధ్వర్యం లో లోకేష్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. టీడీపీ కేంద్ర కార్యాలయంలో లోకేష్ బర్త్‌డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వ హించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకలను జరిపారు.

# నరకం చూపిస్తున్నారు.. మేమిక్కడ ఉండలేం

- విశాఖ జువెనైల్ హోం నుంచి బయటకొచ్చిన బాలికలు
- విచారణకు ఆదేశించిన హోంమంత్రి

**విశాఖపట్నం :** విశాఖ నగరంలోని ప్రభుత్వ ప్రత్యేక బాలికల సదనం, పరిశీలన గృహం (జువెనైల్ హోమ్) బాలికలు బుధవారం ఆందోళనకు దిగారు. ఐదుగురు బాలికలు రక్షణ గోడపైనున్న ఇనుప కంచె దాటుకుని మరీ రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపైకి రాళ్లు, సిమెంటు రేకులు విసిరారు. 'మాకు నరకం చూపిస్తున్నారు. మత్తుమాత్రలు ఇచ్చి మానసిక రోగులుగా మారుస్తున్నారు. న్యాయం చేసి మా ఇళ్లకు పంపండి' అంటూ రోడ్డుపై వెళ్తున్నవారిని దండం పెడుతూ అభ్యర్థించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ నరసింహమూర్తి, సీఐ మల్లేశ్వరరావు, చినగదిలి తహసీల్దార్ పాల్‌కిరణ్ అక్కడికి వచ్చారు. బాలికలకు సర్దిచెప్పి జువెనైల్ గృహానికి తరలించారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ బాలిక తల్లి సైతం తమ కుమార్తెను ఇంటికి పంపకుండా వేధిస్తున్నారని వాపోయారు. 'నా బిడ్డను నాకు ఇవ్వడం లేదు. నువ్వు పిల్లలను అమ్మేసుకుంటావ్ అంటున్నారు. జువెనైల్ హోంలో 8-18 ఏళ్ల బాలికలు 60 మంది వరకు ఉన్నారు. పర్యవేక్షణకు 25మంది సిబ్బంది ఉన్నారు. తామిక్కడ ఉండలేమని, కుటుంబసభ్యులకు అప్పగించాలని కొందరు బాలికలు మూడు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. శ్రీకాకుళం, గోదావరి జిల్లాలు, గుంటూరు, కృష్ణా, హైదరాబాద్‌కు చెందిన ఈ బాలికలను మూడేళ్ల క్రితం ఈ గృహంలో చేర్పించారు. వీరిలో కొందరు బుధవారం గోడదూకి బయటకు రాగా, సిబ్బంది గమనించలేదు. ఈ ఘటనపై హోంమంత్రి అనిత నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. బాలికల ఆరోపణలపై ఆరా తీశారు. మహిళా పోలీస్ అధికారి, తహసీల్దార్ నేతృత్వంలో బాలికలతో మాట్లాడించి వివరాలు తెలుసుకోవాలని, ఆరోపణలు వాస్తవమని తేలితే కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు.

# రేపు కేంద్ర మంత్రులతో చంద్రబాబు భేటీ !

**అమరావతి, జనవరి 23 :** దావోస్‌లో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసింది. ఈ నాలుగు రోజుల పర్యటనలో ముఖ్యమంత్రి పలు కంపెనీల సీఈవోలు, అధిపతులతో చర్చలు జరుపుతూ ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రమోట్ చేశారు. కాగా, దావోస్ పర్యటన అనంతరం సీఎం బృందం ఈరోజు అర్ధరాత్రి తర్వాత ఢిల్లీ చేరుకోనుంది. చంద్రబాబు నేరుగా ఢిల్లీ విమానాశ్రయం నుంచి 1 జన్‌పథ్‌లోని తన అధికారిక నివాసానికి వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేపు (జనవరి 24) ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులతో చంద్రబాబు భేటీ కానున్నారు. రేపు ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ కానున్నారు. కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఏపీకి నిధుల కేటాయింపు అంశంపై ఢిల్లీ పెద్దలతో సీఎం చంద్రబాబు చర్చించే అవకాశం ఉంది. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ కానున్నారు. అనంతరం కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్, ప్రహ్లాద్ జోషిలతో సమావేశం కానున్నారు. ఏపీకి గేమ్ ఛేంజర్ గా భావిస్తున్న పోలవరం, బనకచర్ల అనుసంధాన ప్రాజెక్ట్ నిధుల అంశాన్ని కేంద్రం వద్ద ప్రస్తావించనున్నారు. దావోస్‌లో వివిధ కంపెనీల ప్రతిని ధులు, అధిపతులతో జరిపిన చర్చలకు సంబంధించి ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై సీఎం సమావేశం కానున్నారు.